సాక్షి కర్నూలు

శనివారం ; 29 ; ఏప్రిల్ ; 2023



కేసీకి 414 క్యూసెక్కుల నీరు

గూడూరు: తాగునీటి అవసరాల నిమిత్తం సుంకేసుల జలాశయం నుంచి కేసీ కెనాల్‌కు 414 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 0.71 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం శ్రీశైల దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు.



మృత్యువుకు ఎదురెళ్లి

పాణ్యం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్త మృతి చెందారు. రాంగ్ రూట్‌లో వస్తున్న మోటారు సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. IIలో

న్యూస్‌రీల్

ఎంఐజీ లేఅవుట్ కోసం 100 ఎకరాలు

- భూములను పరిశీలించిన జేసీ, కమిషనర్



భూములను పరిశీలిస్తున్న జేసీ మౌర్య

ఓర్వకల్లు: మధ్య తరగతి ఆదాయ వర్గం(మిడిల్ క్లాస్ ఇన్‌కమ్ (గ్రూపు) వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం కోసం 100 ఎకరాల భూమిని సేకరించాలనే ప్రతిపాదన ఉందని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. శుక్రవారం సాయంత్రం వారు ఓర్వకల్లు మండలం నన్నూరు రెవెన్యూ పరిధిలోని 1300, 1304 సర్వే నంబర్లలో గల సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని, అలాగే పూడిచెర్ల రెవెన్యూ పరిధిలో 386 సర్వే నంబర్‌లోని 100 ఎకరాల భూమిని పరిశీలించారు. గృహ నిర్మాణాలకు అనుకూలతలు, ప్రతికూలతలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వానికి నివేదించనునట్లు పేర్కొన్నారు. వారి వెంట తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ రంగస్వామి ఉన్నారు.


30న ఏకలవ్య గురుకులాలకు ప్రవేశ పరీక్ష

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీటీడబ్ల్యూఆర్ఎస్(బాలికలు) ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మీ గుర్రప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని బి.క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలురు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలికలు)ల్లో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తామన్నారు. 7, 8, 9 తరగతుల్లో ఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీలకు గిరిజన వర్గాలకు చెందిన బాల బాలికలు మాత్రమే అర్హులన్నారు. ఇంకా హాల్‌టికెట్స్ పొందని వారు twreis.apcfss.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

సాగుదారులకు సీసీఆర్‌సీ కార్డులు

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 సంవత్సరానికి సంబంధించి కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాల వారీగా లక్ష్యాలను కేటాయిస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో కొత్తగా సీసీఆర్‌సీ కార్డులు 7315, నంద్యాల జిల్లాలో 12,890 జారీ చేయాలని నిర్ణయించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఆర్బీకేల వారీగా గ్రామ సభలు నిర్వహించి సీసీఆర్‌సీ కార్డుల జారీకి చర్యలు తీసుకుంటారు. గ్రామసభల నిర్వహణకు త్వరలోనే ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. సీసీఆర్‌సీ కార్డులు కలిగిన రైతులు వైఎస్సార్ రైతుభరోసా, ఉచిత పంటల బీమా, మద్దతు ధరలతో పంటలను అమ్ముకునేందుకు అర్హులు అవుతారు. బ్యాంకుల నుంచి పంట రుణాలు కూడా పొందే అవకాశం ఉంది.

తగ్గిన పత్తి ధర



ఆదోని అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర తగ్గింది. గత వారం క్వింటా రూ.8,200 పలికిన ధర శుక్రవారం రూ.7,608 పడిపోయింది. యార్డుకు మొత్తం 2,101 క్వింటాళ్ల పత్తి రాగా గరిష్ట ధర రూ.7,609, మధ్య ధర రూ.7,399, కనిష్ట ధర రూ.4,867 నమోదైంది. మార్కెట్‌లో పత్తి గింజలు, దూదికి డిమాండ్ తగ్గడంతో ధర తగ్గుతోందని వ్యాపారులు తెలిపారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో పంటల సాగుకు డబ్బు అవసరమై ఇంట్లో నిల్వ ఉంచిన పత్తిని అమ్మేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

కర్నూలులో కంప్లయింట్ అథారిటీ

కర్నూలు(హాస్పిటల్): పోలీసులపై వచ్చే ఫిర్యాదులను తీసుకునేందుకు రాయలసీమ జిల్లాలకు కర్నూలులో కంప్లయింట్ అథారిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ అథారిటీ సభ్యులుగా కేవీ రాఘవరెడ్డి(రిటైర్డ్ డీఎస్పీ), సారెడ్డి శశిదేవి(రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్), కాకర్ల నాగేశ్వరరెడ్డి(అడ్వకేట్ ప్రొద్దుటూరు)ని నియమించింది. వీరు పోలీసులపై వచ్చే ఫిర్యాదులను నమోదు చేసుకుని విచారణ చేస్తారు. కాగా.. వైజాగ్, కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు రాజమండ్రి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు గుంటూరులో కంప్లయింట్ అథారిటీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి కేంద్రంలో ముగ్గురు రిటైర్డ్ డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రుణం.. అనుగ్రహం

- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు రుణాలు
- పొదుపు మహిళలకు ఒక్కొక్కరికి రూ.35 వేల రుణం
- మొత్తం 24,609 మందికి రూ.86.13 కోట్లు మంజూరు
- సొంతింటి కల నెరవేరుతున్న ఆనందంలో మహిళలు

కర్నూలు(అర్బన్): పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. ఇంటి నిర్మాణానికి సంబంధించి ఆర్థిక స్తోమత లేని స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక చేయూతను అందిస్తుండడంతో ఆయా కాలనీల్లో గృహ నిర్మాణాల వేగం పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 364 వైఎస్సార్ జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాల్లో వేగం పెంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, స్టీల్‌ను లబ్ధిదారుల చెంతకే సరఫరా చేయడంతో పాటు ఆయా కాలనీల్లో రూ.223 కోట్లు వెచ్చించి అవసరమైన (అంతర్గత రోడ్లు, నీరు, విద్యుత్) మౌలిక వసతులను కల్పించింది. ముఖ్యంగా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలకు తోడుగా, ఇళ్ల నిర్మాణం చేపట్టిన స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు అదనంగా ఒక్కొక్కరికి రూ.35 వేలను రుణంగా అందిస్తోంది. ఇంటి నిర్మాణం చేపట్టిన మహిళలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తరాదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంటోంది. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మహిళలు సొంతంగా ఇళ్లను నిర్మించుకునేందుకు ఉత్సాహాన్ని చూపుతున్నారు.



➡ కోసిగి గ్రామానికి చెందిన అరిగి లక్ష్మికి ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసింది. ఆమె వెంటనే ఇంటి నిర్మాణాన్ని చేపట్టింది. ప్రభుత్వం నుంచి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌తో కలిపి మొత్తం రూ.1.45 లక్షలు అందాయి. ఆమె పొదుపు మహిళ కావడంతో డీఆర్‌డీఏ ద్వారా రూ.35 వేల రుణం కూడా లభించింది. దీంతో ఆమె ఉత్సాహంగా ఇంటి నిర్మాణాన్ని రూఫ్ లెవెల్ వరకు తీసుకొచ్చింది. త్వరలోనే పెయింటింగ్ పనులు పూర్తి చేసి తమ సొంతింటి కలను నిజం చేసుకుంటామంటోంది.



అరిగి లక్ష్మి నిర్మించుకుంటున్న ఇల్లు



➡ ఈమె పేరు కటికె కతిజాబీ. కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామానికి చెందిన ఈమెకు ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు గృహాన్ని మంజూరు చేసింది. గృహ నిర్మాణాన్ని ప్రారంభించిన కతిజాబీకి ప్రభుత్వం ఇప్పటి వరకు సిమెంట్, స్టీల్, ఇసుక, ఎలక్ట్రికల్ వస్తువుల (మెటీరియల్) కోసం రూ.52,665ను మంజూరు చేసింది. అలాగే రూ.76,145ల బిల్లును ఈమె బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తోడు డీఆర్‌డీఏ ద్వారా రూ.35 వేల రుణాన్ని అందించింది. దీంతో ప్రస్తుతం ఈమె నిర్మించుకుంటున్న ఇల్లు రూఫ్ లెవెల్‌కు చేరింది. మరో రెండు నెలల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసి సొంత ఇంట్లోకి వెళ్తామనే ధీమాను కతిజాబీ వ్యక్తం చేస్తోంది.



కటికె కతిజాబీ నిర్మించుకుంటున్న ఇల్లు

ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో ఎంత మందికి రుణం ఇచ్చారంటే

మొత్తం లబ్ధిదారులు:	39,331
రుణం పొందేందుకు ఎంపికైన వారు:	24,635
రుణం మంజూరైన వారు:	24,609
మంజూరు కావాల్సిన వారు:	26
ఇప్పటి వరకు అందించిన రుణం మొత్తం:	రూ. 86,13,15,000

మహిళలు ఉత్సాహాన్ని చూపుతున్నారు



జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సొంతంగా ఇళ్లను నిర్మించుకునేందుకు మహిళలు ఉత్సాహాన్ని చూపుతున్నారు. గృహాలు నిర్మించుకుంటున్న స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ఒక్కొక్కరికి రూ.35 వేల ప్రకారం ఇప్పటి వరకు రూ.86.16 కోట్లను అందించాం. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ ద్వారా 20,252, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ద్వారా 4,383 మందికి రుణాలు అందించాం. ఇప్పటి వరకు 11,045 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. బేస్‌మెంట్ లెవెల్ నుంచి 22,226 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

– కే వెంకటనారాయణ, హౌసింగ్ పీడీ

రైతు కష్టాలు తొలగిస్తున్న ప్రభుత్వం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తూ రైతు కష్టాలు తొలగిస్తోందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. కొక్కెరచేడు గ్రామం మారెమ్మవ్వ సీహెచ్‌సీ గ్రూపు కన్వీనర్ నాగేష్, కో–కన్వీనర్ సరస్వతిలకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద మంజూరైన ట్రాక్టర్‌ను శుక్రవారం ఆలూరులో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొద్దిసేపు ట్రాక్టర్‌ను నడిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం వైఎస్సార్ జలకళ, రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా తదితర పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామాల్లోనే రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. రైతులు నష్టపోకుండా ఈ–క్రాప్ ద్వారా పంటల నమోదు కార్యక్రమం పకడ్బందీగా సాగుతోందని తెలిపారు. రథోత్సవం కోసం హొళగుంద మండలం మార్లమడి గ్రామ సర్పంచ్ రమేష్‌కు మంత్రి గుమ్మనూరు జయరాం రూ. 20 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొక్కెరచేడు నారాయణ, చింతకుంట రమేష్, భాస్కర్, శ్రీను, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురి కావొద్దు

- 29న చేపట్టే ఆందోళనకు దూరంగా ఉండండి
- సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి



కర్నూలు(అర్బన్): గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను కొందరు నాయకులు ప్రలోభాలకు గురి చేస్తున్నారని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు బీ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్ని సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 29వ తేదీన ఇచ్చిన ఆందోళన పిలుపునకు సచివాలయాల ఉద్యోగులు దూరంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు దేశ, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ఎంతో పారదర్శకంగా అత్యధిక ఉద్యోగాలు కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సచివాలయ ఉద్యోగులకు సౌకర్యాలు, లబ్ధి చేకూర్చలేదనే వాదన సరికాదన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రెండు సంవత్సరాలు ప్రొబేషన్ పీరియడ్ పూర్తి చేసుకున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయడంతో పాటు జీతాలను కూడా పెంచారన్నారు. ఈ నేపథ్యంలోనే సచివాలయ ఉద్యోగుల బదిలీల అంశం కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. పరస్పర, భార్యాభర్తల ప్రాతిపదికన, ఆరోగ్య సమస్యలతో కూడిన బదిలీలను చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఇప్పటి వరకు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోని కొందరు నేతలు తమ స్వలాభం కోసం వ్యవహరిస్తున్నారన్నారు. సచివాలయ ఉద్యోగులను తమ బలంగా చూపించుకునేందుకు పలు సంఘాల నాయకులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. అసత్య ప్రచారాలతో రెచ్చగొడుతూ ధర్నాలకు రావాలంటూ పిలుపునిస్తున్న వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. స్వార్థపర శక్తులకు దూరంగా ఉండాలని కోరారు.

రానున్న ఐదు రోజుల్లో వర్షాలు

- ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న ఐదు రోజుల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. గురువారం రాత్రి కొత్తకోటలో 22.0 మిమీ, ఆదోనిలో 1.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇప్పటికు జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడటంతో వేసవి దుక్కులు ముమ్మరంగా సాగుతున్నాయి. రానున్న రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉండటం వల్ల వ్యవసాయ పనులు మరింత ఊపందుకునే అవకాశం ఉంది. వచ్చే నాలుగైదు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు 27.7 డిగ్రీల నుంచి 39.1 డిగ్రీల వరకు, రాత్రి ఉష్ణోగ్రతలు 18.4 డిగ్రీల నుంచి 27.3 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉంది. శుక్రవారం కర్నూలులో పగటి ఉష్ణోగ్రత 37.8 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రత 26.5 డిగ్రీలుగా నమోదైంది.

పిల్లలందరూ బడిలోనే ఉండాలి

- జూన్ 1 నాటికి బడి బయట పిల్లల వివరాలు సేకరించాలి
- పాఠశాలల్లో 100 శాతం హాజరు నమోదు కావాలి
- లేదంటే విద్యాసంస్థలకు తాకీదులు జారీ చేయాలి
- విద్యాశాఖ అధికారులను ఆదేశించిన కలెక్టర్ సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గుమ్మళ్ల సృజన, చిత్రంలో డీఈఓ రంగారెడ్డి తదితరులు

కర్నూలు(సిటీ): బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని, ఈ బాధ్యతను మండల విద్యాశాఖ అధికారులు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదేశించారు. పాఠశాలల్లో వంద శాతం హాజరు నమోదు చేయాలన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థుల హాజరును నమోదు చేయని, వంద శాతం హాజరు లేని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు తాకీదులు జారీ చేయాలని డీఈఓకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి విద్యాశాఖకు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. చిప్పగిరి, నందవరం, తుగ్గలి మండలాల్లో విద్యార్థుల హాజరు వంద శాతం నమోదు చేశారని, కల్లూరు, కృష్ణగిరి మండలాల ఎంఈఓలు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. నేడు (శనివారం)కూడా అన్ని పాఠశాలల్లో వంద శాతం విద్యార్థుల హాజరు నమోదు చేయాలన్నారు. జిల్లాలో బడి బయట పిల్లల వివరాలు సేకరించే బాధ్యతను ఎంపీడీఓ, ఎంఈఓలు, టీచర్లు, సీఆర్‌పీలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు తీసుకోవాలన్నారు. వలసలు వెళ్లారంటే కుదరదని, తల్లిదండ్రులు పిల్లలను ఎక్కడికి తీసుకెళ్లారు? పిల్లలు ఏమి చేస్తున్నారు? ఇళ్ల దగ్గరే ఉండి శిశువుల బాగోగులు చూసుకుంటున్నారా? భిక్షాటన చేస్తున్నారా? ఇలాంటి వివరాలన్నీ కచ్చితమైన గణాంకాలతో జూన్ 1 నాటికి సచివాలయాల వారీగా సేకరించాలని ఆదేశించారు.


కలెక్టర్ ఇంకా ఏమన్నారంటే..

- మంత్రాలయం పరిధిలో ఉన్న సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలను తనిఖీ చేయడం లేదన్నారు. మొత్తం 180 పాఠశాలలకు గాను కేవలం 47 స్కూళ్లలో మాత్రమే తనిఖీలు చేశారని, ఇంత తక్కువగా తనిఖీలు చేయడానికి కారణాలు చెప్పాలని మంత్రాలయం ఎంపీడీఓను ఆదేశించారు. ఎంపీడీఓ నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.
- జగనన్న గోరుముద్ద పథకానికి సంబంధించి జిల్లాలో 1,436 పాఠశాలలకు గాను 1,365 పాఠశాలల్లో గ్యాస్ ద్వారా వంట చేస్తున్నారని, ఈ సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోందని, వాస్తవ నివేదిక వచ్చే మంగళవారం నాటికి అందజేయాలని ఆదేశించారు.
- రక్తహీనతతో ఉన్న యుక్త వయస్సు బాలికలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లు తక్కువగా పంపిణీ చేసిన హాలహర్వి, కౌతాళం, కోడుమూరు, ఆదోని ఎంఈఓలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమోగ్లోబిన్ లేకపోతే పిల్లలకు ప్రాణాపాయమని తెలియదా అంటూ మండిపడ్డారు.
- స్కూళ్లకు విద్యాసంవత్సరం ముగుస్తుండటంతో వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.
- స్కూళ్ల పునఃప్రారంభం నాటికి నాడు–నేడు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, జూన్ 12వ తేదీ నాటికి పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యా కానుకకు సంబంధించిన కిట్లు ప్రతి పాఠశాలలో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ డాక్టర్ కె. వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, సమగ్ర శిక్ష ఈఈ కర్రెన్న తదితరులు పాల్గొన్నారు.

'మద్దతు' వేగం.. చెల్లింపులు ఘనం!

శనగ రైతుకు 'మద్దతు'

- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు
- ఉమ్మడి జిల్లాలో 20,541 టన్నుల కొనుగోలు
- ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.79 కోట్లు జమ
- బహిరంగ మార్కెట్‌లోనూ దిగివచ్చిన దళారీలు



మద్దతు ఇలా..	కర్నూలు జిల్లా:		నంద్యాల జిల్లా:
	5,562	శనగలు విక్రయించిన రైతులు	3,086
	12,480	కొనుగోలు(టన్నుల్లో)	8,061

కర్నూలు(అగ్రికల్చర్): 2022–23 రబీలో మద్దతు ధరతో శనగలు అమ్ముకున్న రైతులకు జాప్యం లేకుండా నగదు బ్యాంకు ఖాతాలకు జమ అవుతుండటం పట్ల ఆనందం వ్యక్తమవుతోంది. శనగ పంటను మద్దతు ధరతో అమ్ముకున్న రైతుల ఖాతాల్లో ఇప్పటికే దాదాపు రూ.79 కోట్లు జమ కావడం విశేషం. కొనుగోలు చేసిన శనగలు గోదాముకు చేరిన వెంటనే నాఫెడ్ రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 600 ఆర్‌బీకేల పరిధిలో శనగ కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతులు దళారీల బారిన పడి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు అన్నదాతకు ఊరటనిస్తున్నాయి. శనగలకు మద్దతు ధర రూ.5,335 ఉండగా.. ఇటీవలి వరకు మార్కెట్‌లో రూ.4,500 వరకే ధర లభించింది. ఈ సమయంలో కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండటం వల్ల దళారీల బారిన పడకుండా మద్దతు ధరతో అమ్ముకున్నారు. ఉమ్మడి జిల్లాలో 20,541 టన్నుల శనగలను మద్దతు ధరతో కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. రెండు జిల్లాల్లో రబీలో పండించిన శనగలను మద్దతు ధరతో అమ్ముకునేందుకు మే నెల వరకు అవకాశం ఉంది.

బహిరంగ మార్కెట్‌లో పెరిగిన ధర

మద్దతు ధరతో శనగల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ శ్రీకారం చుట్టిన తర్వాత బహిరంగ మార్కెట్‌లో శనగల ధర పెరగడం విశేషం. కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాకముందు క్వింటాకు రూ.4,500 వరకే ధర లభించింది. ప్రస్తుతం దళారీలు కూడా శనగల ధర పెంచడం గమనార్హం. బహిరంగ మార్కెట్‌లో శనగల ధర పెరగడంతో కొనుగోలు కేంద్రాలకు శనగల తాకిడి కాస్త తగ్గినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాకు మొదటి విడతలో 14వేల టన్నుల శనగలు మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చింది. ఇప్పటికే మార్క్‌ఫెడ్ 12,480 టన్నులు కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన శనగల విలువ రూ.66.56 కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. లక్ష్యం పూర్తయితే అదనపు కొనుగోలుకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. మద్దతు ధరతో శనగలు అమ్ముకున్న రైతులకు ఇప్పటి వరకు 3,180 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.39.83 కోట్లు జమ కావడం విశేషం. మిగిలిన మొత్తం కూడా కొద్ది రోజుల్లో జమ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నంద్యాల జిల్లాలో రూ.40 కోట్లు జమ

శనగల కొనుగోలు నంద్యాల జిల్లాలో కాస్త నెమ్మదిగా జరుగుతోంది. ఇప్పటి వరకు 3,086 మంది రైతుల నుంచి రూ.43 కోట్ల విలువ కలిగిన 8,061 టన్నుల శనగలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ జిల్లాలో శనగలు మద్దతుతో అమ్ముకున్న రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే 2,860 మంది రైతులకు రూ.40 కోట్లు చెల్లించడం విశేషం.

జాప్యం లేకుండా నగదు జమ



ప్రభుత్వం శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో ఊరటనిస్తోంది. దళారీలు క్వింటా రూ.4500 ప్రకారం కొనుగోలు చేసేందుకు అడిగారు. మార్క్‌ఫెడ్ మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందనే ఉద్దేశంతో అమ్ముకోలేదు. గత మార్చి 5న 37.5 క్వింటాళ్ల శనగలను రూ.5335 మద్దతు ధరతో మార్క్‌ఫెడ్‌కు విక్రయించాం. ఎలాంటి జాప్యం లేకుండా రెండు వారాల్లో రూ.2.62లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి.

– ఎం.విశ్వనాథరెడ్డి, వర్కూరు, కోడుమూరు మండలం

చేతివేళ్లలో అక్షరాల పూదోట!



ప్రపంచం అరచేతిలో ఇమిడిపోయింది. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్, ట్యాబ్, స్మార్ట్ ఫోన్లు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. రోజురోజుకూ సరికొత్త టెక్నాలజీ అందుబాటులోకి వస్తున్నా.. టైప్‌రైటింగ్ మిషన్‌కు ఇప్పటికీ వన్నె తగ్గకపోవడం విశేషం. కంప్యూటర్, ఫోన్లు.. ఇలా దేనినైనా వేగంగా వినియోగించాలంటే టైప్ రైటింగ్ మెషీన్‌పై శిక్షణ తప్పనిసరి. వీటికి ఆదరణ తగ్గినట్లు కనిపించినా.. ఇప్పటికీ ఇందుకు సంబంధించిన ఇన్‌స్టిట్యూట్‌లు కనిపిస్తూనే ఉన్నాయి. లోయర్, హయ్యర్ గ్రేడ్‌లతో పాటు షార్ట్‌హ్యాండ్‌లో సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందే అవకాశం ఉండటంతో టైప్‌రైటింగ్ మెషీన్లు మెరుస్తూనే ఉన్నాయి. ప్రధానంగా వేసవి సెలవుల్లో విద్యార్థులను ఈ ఇన్‌స్టిట్యూట్‌లు ఆకర్షిస్తున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

క్లుప్తంగా

108, 102 వాహనాల్లో డ్రైవర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

కర్నూలు(హాస్పిటల్): 108 అంబులెన్స్, 102 తల్లీబిడ్డ వాహనాల్లో పనిచేసేందుకు డ్రైవర్ల నియామకం చేస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ ఎం.నవీన్ కుమార్, 102 మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 108 డ్రైవర్ పోస్టులకు హాలహర్వి, నందవరం, మంత్రాలయం, హొళగుంద, గోస్పాడు, చాగలమర్రి, ఆళ్లగడ్డ, తుగ్గలి, ప్యాపిలి, సంజామల, ఉయ్యాలవాడలలో ఖాళీలు ఉన్నాయన్నారు. 102 తల్లీబిడ్డ వాహనంలో పనిచేసేందుకు హొళగుంద, నందవరం, వెల్దుర్తి, పెద్దకడుబూరు, కోడుమూరు, శిరువెళ్ల, బేతంచర్ల, నంద్యాల, కర్నూలు, ఆలూరులలో ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు 10వ తరగతి మార్క్స్ మెమో, హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ బయోడేటా, రెండు పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోగ్రాఫ్స్ జిరాక్స్ కాపీలతో మే 1వ తేదీ మధ్యాహ్నం లోపు కర్నూలులోని సి.క్యాంపులో ఉన్న 108 కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

ఆదోనిటౌన్: కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ రామస్వామి తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ శ్రీరాములు(43) మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో భార్య పుట్టినిల్లు అయిన ఇబ్రహీంపురానికి వెళ్లిపోయింది. దీంతో మనోవేదనకు గురైన శ్రీరాములు రెండు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. గురువారం ఆదోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం ఆదోని–ఇస్వీ రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు పట్టాలపై శవమై కనిపించాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం



ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: నాయినపల్లె బీసీ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున చందగాని నడిపి గంగన్న ఇంట్లో విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుని సామగ్రి మొత్తం కాలి బూడిదయ్యింది. వేసవి కావడంతో కుటుంబీకులు కొంత మంది ఇంట్లో, మరికొంత మంది బయట నిద్రించారు. వంట గదిలో ఫ్రిజ్ సమీపంలో ఉండే బోర్డులో నుంచి ఒక్క సారిగా మంటలు చెలరేగి పెద్ద శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు ఏం జరిగిందో తెలియక పరుగున బయటకు పరిగెత్తారు. నిమిషాల వ్యవధిలోనే ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. 15 బియ్యం ప్యాకెట్లు, టీవీ, ఫ్రిజ్, ఇతర సామగ్రితో పాటు విలువైన పత్రాలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి.. తహసీల్దార్ డోనీ ఆల్‌ఫ్రెడ్, ట్రాన్స్‌కో ఏఈ ప్రసన్న ఆంజనేయులుతో కలిసి ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పుస్తక సమీక్షలో వెల్దుర్తి గురుకుల విద్యార్థిని ప్రతిభ



అవార్డు అందుకున్న సుధారాణితో ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన, ఉపాధ్యాయులు

వెల్దుర్తి: ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్) నిర్వహించిన పుస్తక సమీక్షలో వెల్దుర్తి బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకులం విద్యార్థిని డి సుధారాణి ప్రతిభ చాటింది. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు సొసైటీ పంపిన మెరిట్ సర్టిఫికెట్, బహుమతులను (విలువైన పుస్తకాలు) గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన శుక్రవారం విద్యార్థినికి అందించారు. వెల్దుర్తి మండలం బోయనపల్లెకు చెందిన సుధారాణి తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతోందని, ఏపీ స్టేట్ రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ కె మాధవరావు రచించిన 'సంకెళ్లను తెంచుకుంటూ' అన్న పుస్తకాన్ని సమీక్షించిందని ప్రిన్సిపాల్ చెప్పారు. జిల్లాకు ఐదు గురుకులాల నుంచి ప్రతిభ చూపిన వారి సమీక్షను రాష్ట్రస్థాయికి పంపగా తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు, సోషల్ ఉపాధ్యాయులు ఫరీదా, పద్మ, లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8, 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లకు గాను ఎస్టీ జనరల్ కు–53సీట్లు, వికలాంగులకు–2, చెంచులకు–6, పీటీజీ ఓపెన్–1, ఎస్సీలకు–10, బీసీలకు–4, ఓసీలకు–2 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. 6వ తరగతిలో –22 సీట్లు, 7లో –21 సీట్లు, 8లో –11 సీట్లు, 9లో –18 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ సీట్లు కేవలం ఎస్టీ అభ్యర్థుల నుంచి మాత్రమే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 5వ తరగతిలో చేరే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదివి ఉండాలని, 2010 జూన్ 1వ తేదీ – 2014 మే 31వ తేదీ మధ్య జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. బీసీ, ఎసీ విద్యార్థులు 2012 జూన్ 1వ తేదీ నుంచి 2014 మే 31వ తేదీ మధ్య జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని వివరాలకు 9490602371, 9490957267ను సంప్రదించాలని తెలిపారు.

వ్యభిచార గృహ నిర్వాహకుడి అరెస్టు



ముద్దాయిని అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: కర్నూలు శివారులోని నంద్యాల చెక్‌పోస్టు వద్దనున్న వాసవీ నగర్ ప్లాట్ నెం.289లో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న కేసులో మర్రికుంట మహేశ్వరరెడ్డి అలియాస్ రమేష్ చౌదరిని మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఇదే కేసులో కడప జిల్లాకు చెందిన కొబ్బరి రాఘవేంద్ర (ప్రస్తుతం నంద్యాల టౌన్) కలసి వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో గత ఫిబ్రవరి 27వ తేదీన పోలీసులు దాడి చేసి పలువురు విటులను అరెస్టు చేశారు. అయితే ఆ సందర్భంలో మహేశ్వర రెడ్డి తప్పించుకున్నాడు. నందికొట్కూరు రోడ్డులో ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం నిఘా వేసి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు మూడవ పట్టణ సీఐ తబ్రేజ్ తెలిపారు.

వేడినీటిలో పడిన బాలిక మృతి



హరిప్రియ(ఫైల్)

ఆదోని రూరల్: వేడి నీటిలో పడిన ఓ బాలిక మృతి చెందింది. ఈ ఘటన ఆదోని మండలం హానవాళ్ గ్రామంలో చోటుచేసుకుంది. పెద్ద తుంబళం ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల హరిప్రియ(06) ఈనెల 22వ తేదీన ఉదయం ప్రమాదవశాత్తూ ఇంటి ముందు కట్టెల పొయ్యిపై ఉంచిన వేడినీటిలో పడిపోయింది. అదే రోజు తీవ్ర గాయాలపాలైన బాలికను ఆదోని ఏరియా ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యసిబ్బంది కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బాలిక శుక్రవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ చెప్పారు. తల్లి సుమంగళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాల వేలం

కర్నూలు: ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 156 వాహనాలకు ఈనెల 30, మే 1వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో 76 వాహనాలు, ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో 23 వాహనాలు, సి.బెళగల్ పోలీస్‌స్టేషన్‌లో 14, గూడూరు పోలీస్‌స్టేషన్‌లో 8, కోడుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఐదు వాహనాలను ఇదివరలో సీజ్ చేశామన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారుల సమక్షంలో ఉదయం 10 గంటలకు వేలం ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్న వారు తగిన ధరావతు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తెచ్చుకోవాలని, వేలం దక్కించుకున్న వాళ్లు అదేరోజు డబ్బు మొత్తం చెల్లించి వాహనం స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు.

మృత్యువుకు ఎదురెళ్లి

- రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం
- మద్యానికి బానిసైన భర్తకు పసురు తాపించుకునేందుకు వచ్చి మృత్యుఒడికి
- బైక్‌పై రాంగ్ రూట్‌లో వెళ్తుండగా ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- మృతులు వైఎస్సార్ జిల్లా వాసులు



బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు





మృతిచెందిన బరిగెల వెంకటేశులు, ప్రమీల

పాణ్యం: నిర్లక్ష్యం, అతివేగం రెండు ప్రాణాలను బలిగొంది. బైక్‌పై రాంగ్ రూట్‌లో వెళ్లి మృత్యువు బారిన పడ్డారు. కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై పాణ్యం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్త దుర్మరణం చెందారు. పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని యానాది కాలనీలో నివాసముంటున్న బరిగెల వెంకటేశులు (47), ప్రమీల దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశులు మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో పాణ్యం సమీపంలో పసురు తాపించి మద్యం మాన్పించాలని ప్రమీల భావించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం బైక్‌పై భార్యాభర్త పాణ్యం చెంచుకాలనీలో సుంకులా పరమేశ్వరీ ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజారులు ఇచ్చే పసురు తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. అయితే గుడికి 50 మీటర్ల దూరంలో జాతీయ రహదారిని దాటేందుకు వెహికల్ అండర్ పాస్ ఉంది. అయినా కి.మీ. దూరంలోని యూటర్న్ వద్ద దాటాలని రాంగ్ రూట్‌లో వెళ్లాడు. వేగంగా డివైడర్ వెంట వెళ్తుండగా యూటర్న్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. వేగంగా వస్తున్న బస్సును డ్రైవర్ అదుపు చేసే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. బైక్‌ను ఢీకొనడంతో వెనుక కూర్చున్న ప్రమీల రోడ్డుపై పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. వెంకటేశులు ఎగిరి రోడ్డు పక్కన ఉండే ఇనుప కడ్డీపై పడటంతో తలకు తీవ్ర గాయమై దుర్మరణం చెందాడు. బైక్‌లో ఉన్న పూజా సామగ్రి రోడ్డుపై పడ్డాయి. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబీకులు, బంధువులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రుల మృతితో పిల్లలు అనాథలుగా మారారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అప్పటికే వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. వెంటనే వాహనాలు మళ్లించారు. కాగా మృతదేహాలు తరలించే వాహనం ఆలస్యం కావడంతో మృతదేహాలను హైవే పెట్రోలింగ్ పోలీసులు అయూబ్‌ఖాన్, హుసేన్, మధుసూదన్ వేరే వాహనంలో నంద్యాల ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటారు.



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని వినూత్న రైతుల అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నంద్యాల ఏరువాక కేంద్రం సమన్వయకర్త సరళమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 12న నిర్వహించే విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో నలుగురు రైతులకు ఉత్తమ రైతుల అవార్డులను ప్రదానం చేయనున్నామన్నారు. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలతో పాటు రాయలసీమ ప్రాంతాలకు ఒక్కో ఉత్తమ రైతు అవార్డు, ఉత్తమ మహిళా రైతు అవార్డులు ఇవ్వడం జరుగుతుందని, అవార్డులకు ఎంపికైన రైతులు ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు, గుర్తింపు కార్డు, ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నామన్నారు. రైతులు ఎవరైతే గత ఐదేళ్ల నుంచి వ్యవసాయం చేస్తూ వినూత్నంగా నూతనంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభిస్తున్నారో వారు మే 10లోగా దరఖాస్తులను నంద్యాల ఏరువాక కేంద్రంలో అందజేయాలన్నారు.

మందుబాబులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వివిధ ప్రదేశాల్లో మద్యంసేవించి వాహనాలు నడిపిన 20 మంది మందుబాబులకు ఒక రోజులు జైలు శిక్ష పడింది. పట్టణంలో వివిధ ప్రదేశాల్లో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 20 మందిని శుక్రవారం సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి ఎదుట హాజరు పరుచగా ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు కోర్టు అధికారులు తెలిపారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్లు కర్నూలు జిల్లా యూనిట్ 9వ సదస్సు శుక్రవారం స్థానిక జయశ్రీ హోటల్‌లో నిర్వహించారు. ఐఏఎల్ నేషనల్ జనరల్ సెక్రటరీ చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పౌర హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. ట్రాఫిక్ సమస్య నెపంతో రోడ్డు సైడ్ చిరు వ్యాపారులతో పోలీసులు మామూళ్లు వసూళ్లు చేస్తున్నారన్నారు. చిరువ్యాపారులకు అనువైన సౌకర్యం కల్పించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. న్యాయవాదులు పేదలకు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు రంగనాథ్, జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ నాగభూషణం నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు రవికాంత్ ప్రసాద్, పి.దస్తగిరి, బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా, కర్నూలు, నంద్యాల జిల్లాల న్యాయవాదులు పాల్గొన్నారు.

నవవధువు గొంతు కోసిన భర్త



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సానియా

బొమ్మలసత్రం: పెళ్లైన రెండు నెలలకే భార్యపై అనుమానంతో భర్త హత్యాయత్నానికి పాల్పడ్డాడు. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితురాలి తల్లి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని గోపాల్ నగర్ వీధికి చెందిన మౌలాలి, కౌసర్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సానియాను రెండు నెలల క్రితం అదే వీధికి చెందిన భవన కార్మికుడు కరీమ్‌తో వివాహమైంది. పెళ్లైన తర్వాత నుంచి రోజూ అనుమానంతో సానియాను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. వారం క్రితం సానియా తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించటంతో ఇద్దరికి సర్దిచెప్పి పంపించారు. శుక్రవారం మధ్యాహ్నం సానియా భోజనం చేసి నిద్రిస్తుండగా మద్యం మత్తులో ఇంటికి వచ్చిన కరీమ్ బ్లేడ్‌తో ఆమె గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిద్రలోనించి మేల్కొన్న ఆమె తప్పించుకునేందుకు ప్రయత్నించగా బ్లేడ్‌తో వీపుపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. ఆమె కేకలు విని స్థానికులు అక్కడికి చేరుకోవడంతో కరీమ్ పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న ఆమెను చికిత్స ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స చేస్తున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పర్యవేక్షణ వెనక'బడి'

- నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న విద్యాశాఖ అధికారులు
- జిల్లా, మండల కేంద్రాలకే పరిమితం
- పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి పర్యటనతో లోపం బట్టబయలు



హోసూరు జెడ్పీ హైస్కూల్‌లో తనిఖీ చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్(ఫైల్)

కర్నూలు సిటీ: పాఠశాలలపై పర్యవేక్షణను పెంచేందుకు ఖాళీలుగా ఉన్న ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. వారే కాదు.. జిల్లా స్థాయిలోని బాధ్యతాయుతమైన స్థానంలో ఉండే వారు సైతం నామమాత్రం తనిఖీలతో సరిపెడుతున్నారు. జిల్లా కేంద్రం, సమీపంలోని స్కూళ్ల తనిఖీలకు మాత్రమే పరిమితం అయ్యారు. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన స్కూల్స్ 1464 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 2.89 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 8,199 మంది ఉపాధ్యాయులు చదువు చెబుతున్నారు. వీరి పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారి, కర్నూలు, ఆదోని డివిజన్లకు ఇద్దరు డిప్యూటీ డీఈఓలు, 25 మండలాలకు ఎంఈఓలను నియమించారు. మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణకు, ఏపీ మోడల్ స్కూళ్లకు వేర్వేరుగా ఏడీలు ఉంటారు. ఏడీలు రెగ్యులర్ వాళ్లు లేకపోడంతో ఆఫీస్‌లో పని చేస్తున్న ఏడీ–1కి అదనపు బాధ్యతలు అప్పగించారు. వీరంతా స్కూళ్లను పర్యవేక్షించాలి. కానీ అత్యధిక శాతం మంది ఆఫీస్ పని, నాడు–నేడు తదితర పనుల సాకుతో క్షేత్రస్థాయి పరిశీలన మరిచారు. మధ్యాహ్న భోజన సమయంలో ఏదో ఒక స్కూల్‌కి సీఆర్‌పీ వెంటబెట్టుకొని వెళ్లి భోజనం తనిఖీ చేసినట్టు ఐఎంఎంఎస్ యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేస్తున్నారు. స్కూల్‌లో బోధన ఏ విధంగా జరుగుతుంది? పిల్లలకు హోం వర్క్ ఇచ్చి వారి చేత చేయిస్తున్నారా? పరీక్షలు ఏ విధంగా రాయిస్తున్నారు? పిల్లల్లో అభ్యసన నైపుణ్యాలు ఏ మేరకు ఉన్నాయి? హాజరు శాతం ఏ విధంగా ఉంది? గైర్హాజరు అయిన వారు ఎక్కువగా ఏ కారణం చేత స్కూల్‌కి డుమ్మా కొడుతున్నారో తెలుకోవడం లేదు. ఉపాధ్యాయులతో కలిసి పిల్లల ఇళ్లకు వెళ్లి చదువు విలువపై తల్లిదండ్రులకు అవగాహన చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ జిల్లాలో ఏ ఒక్క అధికారి కూడా ఇలా చేయకపోవడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ప్రాథమిక పాఠశాలల్లోని పిల్లలకు కనీసం ప్రాథమిక అంశాలు కూడా తెలివంటే తప్పెవరిది? పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమేనని స్పష్టంగా తెలుస్తోంది.

- గత కొన్ని రోజుల క్రితం పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లాలోని హోసూరు జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంలో ఓ సబ్జెక్టు టీచర్‌ను సిలబస్ పూర్తి అయ్యిందా? క్యాలెండర్ ప్రకారం పాఠం భోధించి పాఠం చివరిలో ఉన్న ప్రశ్నలకు సమాధానాలను పిల్లల చేత నోట్స్ రాయించారా? అని అడగగా ఉపాధ్యాయుడి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో డీఈఓ, డీప్యూటీ డీఈఓలపై ప్రిన్సిపల్ సెక్రటరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే వాటి ఫలితాలు చూపాల్సిన అధికారులుగా పర్యవేక్షణ చేసే భాధ్యతలను మరిచితే ఎలా అని ప్రశ్నించారు. పనిచేయని టీచర్‌ది కాదు తప్పు..వారి చేత పని చేయించలేకపోయిన డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలది అని అధికారుల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- బురుజుల ఎంపీపీఎస్ స్కూల్‌లో విద్యార్థులకు అందించే కోడి గుడ్లపై రంగులు లేకపోవడాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ గుర్తించారు. కోడి గుడ్లపై రంగులు ఉండాలి కదా? అని అధికారులను ప్రశ్నించగా, సెక్రటరీ ముందే ఆ స్కూల్ టీచర్‌ను అధికారులు రంగులు లేని గుడ్లను ఎలా తీసుకుంటారని దబాయించారు. పర్యవేక్షణ చేయని అధికారుల తీరుపై సెక్రటరీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

.. జిల్లాలో ఈ రెండే కాదు. అత్యధిక శాతం ప్రభుత్వ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపిస్తోంది.

నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుంటాం

ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ చేస్తున్నాం. ఉపాధ్యాయులతో పని చేయించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపైనే ఉంటుంది. పర్యవేక్షణ అధికారులకు ఒక్క స్కూల్ మాత్రమే కాదు కదా. కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిసింది. వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుంటాం. వారిచ్చిన వివరణ సక్రమంగా లేకపోతే చర్యలు ఉంటాయి. – వి. రంగారెడ్డి, డీఈఓ

తెలుగులోనూ రైల్వే టికెట్ బుకింగ్

- ఫోన్‌లో యూటీఎస్ యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం
- అన్ రిజర్వుడ్ టికెటింగ్ సిస్టమ్‌లో సరికొత్త సేవలు
- ఆన్‌లైన్, యాప్‌ల్లో జనరల్ టికెట్ల బుకింగ్ ఇక సులువు
- రైల్వేస్టేషన్లలో క్యూలైన్ల బాధలకు చెక్


క్యూలైన్‌లో రైల్వే టికెట్ కోసం నిలబడి ఉన్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: జనరల్ టికెట్ కోసం ఆదరాబాదరాగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని.. చాంతాడంత పొడవు ఉండే క్యూలైన్లలో నిలబడి.. ఈలోపు తాము ఎక్కాల్సిన రైలు వెళ్లిపోతుందేమోనని ఆదుర్దా పడేవారే ఎక్కువ. ఇలా ఇబ్బందులు పడే ప్రయాణికుల కోసం రైల్వే శాఖ నాలుగేళ్ల క్రితం అన్ రిజర్వుడ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్)ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. యూటీఎస్ విధానంలో యాప్, వెబ్‌సైట్ ద్వారా రైలు టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇంగ్లిష్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దీన్ని ప్రాంతీయ భాషలకు కూడా రైల్వే శాఖ విస్తరించింది. దీంతో తెలుగు సహా వివిధ ప్రాంతీయ భాషల్లోనూ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సాధారణ (జనరల్) రైలు టికెట్లను దిగువ శ్రేణి ప్రయాణికులు ఎక్కువగా తీసుకుంటారని.. వీరి కోసం ప్రాంతీయ భాషల్లో యాప్‌ని తీసుకొస్తే వినియోగం మరింత పెరుగుతుందనే ఉద్దేశంతో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

ఎలాంటి శ్రమ లేకుండా యాప్ నుంచే..

యూటీఎస్ యాప్ ద్వారా ఎలాంటి శ్రమ లేకుండా మొబైల్ ఫోన్ నుంచే జనరల్ టికెట్ పొందొచ్చు. అయితే టికెట్ బుక్ చేసుకోవడానికి ఇంగ్లిష్ మాత్రమే అందుబాటులో ఉండటంతో గ్రామీణులు, పెద్దగా చదువుకోనివారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సులభంగా యాప్ వినియోగించేలా ప్రాంతీయ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ, కన్నడం, మలయాళం, మరాఠీ, ఒడియా, తమిళ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా జనరల్ టికెట్‌తో పాటు ప్లాట్‌ఫామ్ టికెట్ కూడా కొనుగోలు చేయొచ్చు. అలాగే సీజన్ టికెట్ బుకింగ్, రెన్యువల్ సైతం చేసుకోవచ్చు. యూటీఎస్ యాప్‌లో ప్రాంతీయ భాషల అప్‌డేట్ వెర్షన్‌ను ఆండ్రాయిడ్, ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. హార్డ్ కాపీ, పేపర్‌లెస్ టికెట్.. రెండు ఆప్షన్లు ఉన్నాయి.

యూటీఎస్ యాప్

ఎన్ని భాషల్లో: తెలుగు, ఇంగ్లిష్, కన్నడం, మలయాళం, హిందీ, తమిళం, ఒడియా, మరాఠీ
దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న రైల్వేస్టేషన్లు: 9,120
డౌన్‌లోడ్ చేసుకున్నవారు: 10 మిలియన్లకు పైగా
యాప్ ద్వారా రోజుకు బుక్ అవుతున్న టికెట్లు: 2.34 లక్షలు
రోజూ వినియోగిస్తున్న ప్రయాణికులు: 14.21 లక్షల మంది

స్టేషన్‌కు 5 కి.మీ. పరిధిలో..



మొబైల్‌లోని జీపీఎస్ ఆధారంగా యూటీఎస్ యాప్ పనిచేస్తోంది. టికెట్ బుక్ చేసుకునే సమయంలో మొబైల్ జీపీఎస్ లొకేషన్ ఆన్‌లో ఉండాలి. రైల్వేస్టేషన్ ఆవరణకు 30 మీటర్ల నుంచి 5 కి.మీ. పరిధిలో ఉన్న ప్రయాణికులు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా యాప్ ద్వారా 3 నెలలు, 6 నెలలు లేదా సంవత్సరానికి సీజన్ టికెట్లను తీసుకోవచ్చు. ఎక్స్‌ప్రెస్, మెయిల్, ప్యాసింజర్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు యూటీఎస్ టికెట్ బుకింగ్ చెల్లుబాటు అవుతుంది.
– అనూప్‌కుమార్ సత్పతి, డీఆర్‌ఎం, వాల్తేరు

ఆ సంఘాల ఆందోళనలకు దూరంగా ఉందాం

- గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు
- ఒకే విడతన 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- సచివాలయ ఉద్యోగులకు, ప్రభుత్వం మధ్య సుహృద్భావ వాతావరణం ఉంది
- కొన్ని సంఘాలు స్వార్థం కోసం దానిని చెడగొట్టడానికి చూస్తున్నాయి
- సచివాలయాల ఉద్యోగులందరూ గమనించాలి
- ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనవద్దు

సాక్షి, అమరావతి : స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని ఉద్యోగ సంఘాలు చేపట్టిన ఆందోళనలకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు దూరంగా ఉండాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ యూనియన్ పిలుపునిచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి, ఒకే విడతలో లక్ష మందికి పైగా ఉద్యోగాలిచ్చి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని తెలిపింది. అలాంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని ఉద్యోగ సంఘాలు శనివారం నిర్వహించతలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనవద్దని తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య సుహృద్భావ వాతావరణం ఉందని, కొన్ని ఉద్యోగ సంఘాలు స్వార్థ, రాజకీయ అవసరాలకు ఆ వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఉద్యోగులందరూ దీనిని గమనించాలని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, అదనపు ప్రధాన కార్యదర్శి బీఆర్ ఆర్ కిషోర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా 1.34 లక్షల గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగాలను భర్తీ చేసి, ఇచ్చిన మాట ప్రకారం ప్రొబేషన్ డిక్లేర్ చేసి అందరినీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులర్ చేసిన సీఎం జగన్‌కు సచివాలయాల ఉద్యోగులందరూ ఎప్పటికీ కృతజ్ఞులుగానే ఉంటారని పేర్కొన్నారు. ఉద్యోగులు కోరిన విధంగా 010 పద్దు కింద జీతాలు ఇచ్చారని, డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో నెగిటివ్ మార్కులు తొలగించారని, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు, శానిటేషన్ సెక్రటరీలకు వీక్లీ ఆఫ్‌లు ఇచ్చారని తెలిపారు. సచివాలయాల ఉద్యోగులకు అనేక మేళ్లు జరిగాయంటే సీఎం జగన్‌కు మనపై ఉన్న ప్రేమాభిమానాలే కారణమని చెప్పారు.

బదిలీలపై గందరగోళం సృష్టిస్తున్నారు

సచివాలయాల ఉద్యోగులు చాలా మంది వివిధ కారణాలతో బదిలీలు కోరుకుంటున్నారని తెలిసిన వెంటనే సీఎం జగన్ అంగీకారం తెలిపారన్నారు. సచివాలయాల మహిళా ఉద్యోగులు పెళ్లి చేసుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తే.. కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులు రిక్వెస్టు బదిలీలు కాదని, సాధారణ బదిలీలు జరపాలని వితండ వాదం చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్ల సర్వీస్ పూర్తయి బదిలీ కావాలని కోరుకున్నా ట్రాన్స్‌ఫర్ చేయకూడదని, మూడేళ్ల సర్వీస్ పూర్తయిన వారందరినీ బదిలీ చేయాలని వాళ్లు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సచివాలయాల ఉద్యోగులందరినీ బదిలీ చేయమని చెప్పడానికి వీళ్లెవరని నిలదీశారు. బదిలీ వద్దనుకొనే ఉద్యోగిని కూడా బలవంతంగా బదిలీ చేయమనడానికి వీళ్లకేం హక్కుందన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకే సాధారణ బదిలీ చేయడం సంప్రదాయంగా వస్తోందని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు మాత్రం మూడేళ్లకే సాధారణ బదిలీలు చేయమని ఉద్యోగ సంఘం నాయకులు ఎలా అడుగుతారని అన్నారు. గందరగోళం సృష్టించి బదిలీ ప్రక్రియను అడ్డుకోవడానికి కొందరు జేఏసీల పేరుతో ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని తప్పుపట్టారు. దీనిని అందరూ గమనించాలని కోరారు. సచివాలయాల ఉద్యోగులు ఆ ధర్నాలు, నిరసనలు, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు.

వేదాలు విజ్ఞాన భాండాగారాలు

- రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్
- ఘనంగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం
- ఇద్దరికి మహా మహోపాధ్యాయ, ఇద్దరికి వాచస్పతి పురస్కారాలు
- 539 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం


స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్

తిరుపతి ఎడ్యుకేషన్: వేదాలు విజ్ఞాన భాండాగారాలని, ఆధునిక మానవ సమాజం శాంతి, సౌఖ్యాలతో జీవించడానికి వీటిలోని అంశాలు ఎంతగానో దోహదం చేస్తాయని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చెప్పారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం శుక్రవారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ ఈ స్నాతకోత్సవానికి హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన వేద పండితులు వి.సుబ్రహ్మణ్య శాస్త్రి సలక్షణ ఘనాపాఠి, చెన్నైకి చెందిన ఆర్. మణి ద్రావిడ శాస్త్రికి మహా మహోపాధ్యాయ పురస్కారాలను గవర్నర్ ప్రదానం చేశారు. అన్నవరానికి చెందిన కె. రామ సోమయాజి శాస్త్రి, మైసూరుకు చెందిన సి.వంశీకృష్ణ ఘనాపాఠికి వాచస్పతి పురస్కారాలను అందజేశారు. సర్టిఫికెట్ కోర్సుల నుంచి పీహెచ్‌డీ వరకు వేద విద్యనభ్యసించిన 539 మందికి డిగ్రీ పట్టాలను అందజేశారు. గవర్నర్ మాట్లాడుతూ.. వేలాది సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు గణిత, వైజ్ఞానిక, ఆర్థిక, సాంకేతిక, జ్యోతిష్య శాస్త్రాలను వేదాల్లోని వైదిక అంశాలతో మేళవించి ప్రపంచానికి తెలియజేశారన్నారు. భారతీయ సంప్రదాయం, ఆధునిక శాస్త్ర సాంకేతికత మధ్య సమన్వయం పెంపొందించుకోగలిగితే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ రాధే శ్యాం, ఈసీ సభ్యులు హరే కృష్ణ శతపతి, ఫణి యాజులు తదితరులు పాల్గొన్నారు.

కడప దర్గాను దర్శించుకోవడం నా అదృష్టం

కడప కల్చరల్/రాజంపేట/ఒంటిమిట్ట: మతసామరస్యానికి ప్రతీక అయిన కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకోవడం తన అదృష్టమని, ఇది దైవం కల్పించిన మహాభాగ్యంగా భావిస్తున్నానని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కడప పెద్ద దర్గాకు వచ్చారు. దర్గాలో గవర్నర్ పూలచాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గవర్నర్ వెంట ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, కడప నగర మేయర్ సురేష్‌బాబు, కలెక్టర్ విజయరామరాజు ఉన్నారు.

ఒంటిమిట్ట రాములోరిని దర్శించుకున్న గవర్నర్

ఒంటిమిట్టలోని కోదండరాముడిని గవర్నర్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. గవర్నర్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ వైఎస్సార్ జిల్లా పర్యటన ముగించుకుని ఒంటిమిట్ట నుంచి సాయంత్రం 6.03 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. శనివారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఐఐటీలకు దీటుగా ఉద్యాన వర్సిటీ

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అకడమిక్ బ్లాక్, హాస్టళ్లను ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల

రైల్వేకోడూరు: ఐఐటీలు, ఎన్ఐటీలకు దీటుగా ఉద్యాన, వ్యవసాయ వర్సిటీలను తీర్చిదిద్దుతామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. అన్నమయ్య జిల్లా అనంతరాజుపేటలోని వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో రూ.22.81 కోట్లతో నిర్మించిన అకడమిక్ బ్లాక్, రెండు గర్ల్స్ హాస్టళ్లు, ఒక బాయ్స్ హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఉత్పత్తుల ఎగ్జిబిషన్ భవనాలను శుక్రవారం మంత్రి కాకాణి ప్రారంభించారు. వనిపెంటలోని కేవీకే అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటుచేసిన ఉద్యాన వర్సిటీ అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ అభివృద్ధికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పరిధిలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతరాజుపేట కళాశాలలో రైతుల వసతిగృహం, అతిథిగృహం ఏర్పాటుచేయాలని మంత్రిని కోరారు. వైఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకీరాం మాట్లాడారు. అనంతరం పుట్టగొడుగుల సాగుపుస్తకం, కరపత్రాలు, అంబాజీపేట పరిశోధనా స్థానం రూపొందించిన కొబ్బరి సాగుకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు

- ఈ ఏడాది నుంచి రీస్ట్రక్చర్.. సిలబస్ రీడిజైన్
- ఈ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు
- ఫ్యాప్సీ అవార్డుల సన్నాహక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి బుగ్గన


మాట్లాడుతున్న ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం: ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రీస్ట్రక్చర్‌తో పాటు సిలబస్‌ను రీడిజైన్ చేస్తామని తెలిపారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫ్యాప్సీ) ఎక్సలెన్స్ అవార్డ్స్–2023 సన్నాహక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసిన వారు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఆటోమొబైల్ రంగాల్లో వీరు తమ నైపుణ్యంతో రాణించేలా తయారు చేస్తామని చెప్పారు. వాణిజ్యం, పారిశ్రామికాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఐటీఐల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో 192 స్కిల్ హబ్‌ల్లో మెరికలు తిరిగే కోర్సులను డిజైన్ చేశామని, వీటి ద్వారా వేలాది మంది యువతకు నైపుణ్య శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. అర్హులైన పారిశ్రామికవేత్తలకు ఫ్యాప్సీ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కొత్త పారిశ్రామిక పాలసీలో కొన్ని మార్పులు చేయాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి అవసరమైతే మార్పులు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇండస్ట్రియల్ హోదా కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కీలకపాత్ర ఉందన్నారు. ఫ్యాప్సీ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి కరుణేంద్ర మాట్లాడుతూ ఫ్యాప్సీ ఎక్సలెన్స్–2023 అవార్డుల కోసం జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11 కేటగిరీల్లో ఈ అవార్డులుంటాయని, ఈ అవార్డులు ఇవ్వడానికి 11 మంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని తెలిపారు. ఈ అవార్డులను ఆగస్టు ఆఖరు లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ప్రదానం చేస్తామని చెప్పారు.అనంతరం అవార్డుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు, మాజీ అధ్యక్షుడు అచ్యుతరావు, ఎఫ్‌టీసీసీఐ సీఈవో ఖ్యాతి తదితరులు పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

- తన జల్సాలను ప్రశ్నిస్తున్నాడని భర్తను హత్య చేసిన జమలమ్మ
- ఎన్టీఆర్ జిల్లాలో ఘటన

విజయవాడ స్పోర్ట్స్ : తన జల్సాలకు అడ్డుపడుతున్న భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మి శుక్రవారం తీర్పు చెప్పారు. 2016 నవంబర్ 23న కొత్తపేట (టూ టౌన్) పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఈ ఘటన అప్పట్లో నగర ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన జమలమ్మకు జి.కొండూరు మండలం వెంకటాపురానికి చెందిన ఏడుకొండలు(32)కు 16 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్నాళ్లకు జమలమ్మ చెడు వ్యసనాలకు బానిసైంది. వీటిపై ప్రశ్నిస్తున్న భర్త ఏడుకొండలును అడ్డు తొలగించుకోవాలనే నిర్ణయాన్ని తన చెల్లెలు లక్ష్మికి వివరించింది. అదే గ్రామంలో హత్య చేస్తే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో కాపురాన్ని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి.నైనవరం గ్రామానికి మార్చింది. అంబాపురంలో కొత్త ఇంట్లోకి ప్రవేశించిన రోజునే చెల్లెలు లక్ష్మి, న్యూఆర్‌ఆర్ పేటకు చెందిన ఒడియార్ గణేష్, జక్కంపూడికి చెందిన బాలసాని తిరుపతి సాయంతో జమలమ్మ తన భర్త ఏడుకొండలు మెడకు తాడు చుట్టి చంపేసిందని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. మూడు రోజుల తర్వాత ఆ గది నుంచి వస్తున్న దుర్వాసను పసిగట్టిన ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జమలమ్మకు కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. మిగిలిన నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా విడుదలయ్యారు.

చైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన వాణి

పెనమలూరు : శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన జగన్నాథం వాణి(17) కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతోంది. గత రెండు రోజుల కిందట ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయింది. కాగా గురువారం వాణి సోదరుడు రాము కాలేజీ హాస్టల్‌కు వచ్చి వాణితో మాట్లాడి వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం కాలేజీ హాస్టల్‌లో స్టడీ అవర్‌కు రావాల్సిన వాణి రాలేదు. దీంతో ఆమె కోసం రూమ్‌కు వెళ్లి మిత్రులు చూడగా ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతి చెంది ఉంది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమంలో పాల్గొనం

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

సాక్షి, అమరావతి: రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమాల్లో పాల్గొనబోమని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వంపై పోరాటం చేసే విధంగా కొన్ని శక్తులు సచివాలయ ఉద్యోగులను రెచ్చ గొడుతున్నాయని తెలిపింది. సచివాలయ ఉద్యోగులు వారి మాటలకు ప్రభావితం కావొద్దని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా, ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, ఉపాధ్యక్షులు సిరిపురం హరి, కె.రామకృష్ణా రెడ్డి, జి.హరీంద్ర, కె.కిరణ్, బి.పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ లబ్ది కోసం ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడానికి కొందరు కుట్ర చేస్తున్నారని, ఇలా కుట్ర పన్నిన వారెవ్వరూ తమకు ఉద్యోగాలివ్వలేదని చెప్పారు. తమను ఉద్యోగులుగా గుర్తించని వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్న సచివాలయ ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీయడానికి చేస్తున్న కుట్రను ఖండిస్తున్నట్లు తెలిపారు.

ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

అధ్యక్ష , కార్యదర్శులుగా కె.వైధురిదేవి, ఎ.సుస్మిత


ఎన్నికైన సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షురాలిగా కె.వైధురి దేవి, ఉపాధ్యక్షురాలిగా ఎం.లక్ష్మణ కుమారి, కార్యదర్శిగా ఎ.సుస్మిత, అదనపు కార్యదర్శి(జనరల్)గా ఎం.రాజేశ్వరి, అదనపు కార్యదర్శి (కల్చరల్)గా ఎస్.నాగ లలితాదేవి, సంయుక్త కార్యదర్శిగా కె.సునీత, కోశాధికారిగా టి.శారద ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.విజయలక్ష్మి, డి.సాహిత్య వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల వివరాలను ఎన్నికల అధికారి ఎస్.శాంతి కుమారి శుక్రవారం ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన ఉద్యోగుల హక్కుల రక్షణకు చర్యలు

ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

సాక్షి, అమరావతి: గిరిజన ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు చెప్పారు. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఎస్టీ ఉద్యోగుల సర్వీసు సమస్యలపై గురు, శుక్రవారాల్లో విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ విచారణ నిర్వహించింది. ఈ విచారణకు అధ్యక్షత వహించిన రవిబాబు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యలపై ఏడు శాఖలకు చెందిన అధికారులను పిలిచి విచారించినట్లు తెలిపారు. గిరిజన ఉద్యోగులకు న్యాయం జరిగే విధంగా సూచనలు చేసినట్లు చెప్పారు. గిరిజన ప్రజల నివాస, వ్యవసాయ భూముల సమస్యలపై కూడా విచారణ చేసి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. రాష్ట్రంలో గిరిజన ప్రజలు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ కార్యదర్శి డాక్టర్ గంగాధర్, డిప్యూటీ డైరెక్టర్ పాట్లూరి పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల విలువ పెంపుతో గిరి రైతు మనుగడ

- అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జగన్నాథరావు
- కనుల పండువగా విత్తనాల పండగ

డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏజెన్సీలో పంటల ఉత్పత్తుల విలువ హెచ్చింపుతోనే గిరిజన రైతులకు మనుగడ ఉంటుందని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జగన్నాథరావు అన్నారు. డుంబ్రిగుడ మండలం కిల్లోగుడ గ్రామంలో సంజీవని సంస్థ, థింసా గిరిజన ఉత్పత్తిదారుల సంఘం సంయుక్తంగా శుక్రవారం జీవ వైవిధ్య జాతరలో భాగంగా విత్తనాల పండగను ఘనంగా నిర్వహించింది. గిరిజన రైతుల సంప్రదాయ విత్తనాలతో పాటు ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలు సంస్థల ప్రతినిధులు దేశీయ విత్తనాల స్టాళ్లను ప్రదర్శించారు. డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పాత విత్తనాల ద్వారా గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న అన్ని పంటల్లోనూ పోషక విలువలు అధికంగా ఉన్నాయన్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సురేష్‌కుమార్, రైతు సాధికారత సంస్థ రీజినల్ టెక్నికల్ అధికారి ఎం.సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఉద్యోగ విప్లవం

- ఒకే వేదికపై 761 మందికి ఆఫర్ లెటర్స్
- తల్లిదండ్రుల సమక్షంలో ఉద్యోగ పత్రాలు


తల్లిదండ్రులకు నమస్కరిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): అమ్మానాన్నల పాదాలకు విద్యార్థులు నమస్కరించారు. తమ అభ్యున్నతికి అహరహం శ్రమించిన తల్లిదండ్రులను విశ్వవిద్యాలయం వేదికగా విద్యార్థులే సత్కరించారు. ఈ అరుదైన సంఘటన గురువారం ఆంధ్రవిశ్వవిద్యాలయం (ఏయూ)లో కనిపించింది. విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైన్స్ కళాశాల అచీవర్స్ డే దీనికి వేదికైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగ విప్లవానికి వేదికగా నిలిచింది. ఏయూలో ఉద్యోగాలు సాధించిన 761 మంది విద్యార్థులకు ఆ వేదికపై నియామక పత్రాలను అందించే కార్యక్రమాన్ని ఏయూ నిర్వహించింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఏయూ రాష్ట్రానికి ఆదర్శంగా, విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా నిలుస్తోందని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రత్నాల్లాంటి పిల్లలను పెంచి విశ్వవిద్యాలయానికి పంపిన తల్లిదండ్రులందరినీ సన్మానించడం చూసి గర్విస్తున్నామన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. వర్సిటీలో ప్రతి విద్యార్థి ఉద్యోగ సాధన, ఉపాధి కల్పన చేసే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారని, దీన్ని సాకారం చేసే దిశగా ఏయూ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి ఇచ్చే నిజమైన సంపద విద్య అని ముఖ్యమంత్రి ఇదే వేదిక నుంచి అన్నారని గుర్తుచేశారు. క్రమశిక్షణతో మీ పిల్లలను పెంచినందుకు మీ అందరికీ వందనం అంటూ తల్లిదండ్రులకు నమస్కరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది 81 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఈ సంవత్సరం దీన్ని అధిగమించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తదితరులు ప్రసంగించారు.

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.2 లక్షల నష్టం.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ఫీజుల పేరుతో పెదనాన్న, బాబాయిల దగ్గర్నుంచి నగదు వసూలు
- ఆన్‌లైన్‌లో లుడో ఆడి డబ్బులు పోగొట్టుకున్న వైనం
- ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చేర్పించిన స్థానికులు

బాపట్లటౌన్ : ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి బీటెక్ విద్యార్థి రూ.2 లక్షలు నష్టపోయి చివరకు ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. కర్లపాలెం మండలం చింతాయపాలేనికి చెందిన తాళ్లూరి వెంకటనారాయణ విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 27న ఉదయం ఆన్‌లైన్‌లో లుడో గేమ్ తన స్నేహితులతో కలిసి ఆడాడు. ఈ గేమ్‌లో తొలుత రూ.100 పెట్టుబడికి రూ.1000 వరకు వచ్చాయి. ఇదే మోజులో సాయంత్రం వరకూ ఆడుతూనే ఉన్నాడు. ఇంతలో పాకెట్‌మనీ నిమిత్తం చేతిలో ఉంచుకున్న రూ.30 వేలు పోయాయి. తర్వాత తన స్నేహితుడి వద్ద రూ.70 వేలు, తన పెదనాన్న, బాబాయిలకు ఫోన్ చేసి కళాశాలలో ఫీజు చెల్లించాలంటూ నమ్మబలికి మరో రూ.లక్ష వరకూ తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో విడతల వారీగా రూ.2 లక్షలు కోల్పోయాడు. దీంతో ఏం చేయాలో పాలుపోక శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి రైలు మార్గాన బాపట్ల చేరుకున్నాడు. అప్పటికే ఎలుకల పేస్ట్ తిన్నాడు. రైల్వేస్టేషన్‌లో తీవ్ర ఇబ్బంది పడుతుండటాన్ని ప్రయాణికులు గమనించి స్టేషన్‌మాస్టర్ సాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు.